కొండంత 'ఆసరా'

- స్వయం సహాయక బృందాలకు ఆర్థిక భరోసా
- తూర్పులో 28,103 మందికి వైఎస్సార్ ఆసరా 4వ విడత లబ్ధి
- ఇటీవల రూ.15.38 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం


తూర్పులో 4వ విడత ఆసరా చెక్కును లబ్ధిదారులకు అందిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ(ఫైల్)

ఎంవీపీ కాలనీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'వైఎస్సార్ ఆసరా'పథకం అక్క చెల్లెమ్మలకు ఆర్థిక భరోసానిస్తోంది. స్వయం సహాయక సంఘాల ద్వారా సాధికారత సాధిస్తున్న మహిళలను మరింత ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 3 విడతలుగా ఆయా సంఘాలకు నిధులు మంజూరు చేయగా.. ఇటీవల 4వ విడత నిధులను విడుదల చేసింది. విశాఖ జిల్లాతో పాటు ప్రస్తుతం తూర్పు నియోజకవర్గంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం విస్తృతంగా సాగుతోంది. ఆయా సంఘాలకు బ్యాంకు రుణాల విముక్తితో పాటు వారి ఉత్పత్తుల సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా పెద్ద ఎత్తున ప్రోత్సాహం లభిస్తోంది.

తూర్పు పరిధిలో అర్హులు 28,103 మంది

తూర్పు నియోజకవర్గం పరిధిలో 4వ విడత వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా 28,103 మంది లబ్ధిపొందుతున్నారు. వారికి ఈ విడత రూ.15.38 కోట్లు ఆర్థిక సాయం పొందుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఇప్పటికే 3 దఫాలుగా ఆయా సంఘాల మహిళలు డబ్బులు అందుకోగా.. ప్రస్తుతం 4వ విడత నిధుల పంపిణీ ప్రక్రియ సాగుతోంది. తూర్పు నియోజకవర్గంలో అత్యధికంగా 11వ వార్డులో ఈ పథకానికి 4210 మంది అర్హులు కాగా.. 22వ వార్డులో 2552 మంది లబ్ధిదారులు, 28వ వార్డులో 2256 మంది ఆ తరువాతి స్థానంలో ఉన్నారు. 27వ వార్డులో అత్యల్పంగా 240 మంది అర్హత కలిగి ఉన్నారు.

నియోజకవర్గంలో వార్డుల వారీగా వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులు

వార్డు సంఖ్య	లబ్ధిదారుల సంఖ్య	17	1842
		18	1306
09	2120	19	1144
10	1605	20	802
11	4210	21	1170
12	1652	22	2552
13	2140	23	1390
15	1896	27	240
16	1778	28	2256

ప్రభుత్వ సాయం భరోసానిస్తోంది..



మాది 18వ వార్డు అప్పుఘర్. శివ పార్వతి గ్రూప్ ద్వారా ప్రభుత్వ అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకుంటున్నాం. రుణమాఫీ, సున్నా వడ్డీ, ఆసరా ద్వారా మా కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించింది. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బాటలోనే సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నారు. ఆసరా ద్వారా ఇప్పటికే మూడు విడతలు అందుకున్నాం. ఇప్పుడు నాలుగో విడత మంజూరు కావడం ఆనందంగా ఉంది. ప్రస్తుతం మా ఖాతాల్లోకి ఆ నిధులు విడుదల ప్రక్రియ జరుగుతోంది.

–చీకటి శారదా, ఆసరా లబ్ధిదారు, 18వ వార్డు

ఇది పేదల ప్రభుత్వం



వైఎస్ జగన్ సర్కారు పేదల ప్రభుత్వం. పేదలను అన్ని విధాలా ఆదుకుంటోంది. మాది 17వ వార్డులోని శ్రీవర్ష గ్రూప్. అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ఇంటికొచ్చి మరీ పెన్షన్ అందజేస్తున్నారు. ఇప్పుడు 4వ విడత ఆసరా నిధులు మంజూరు చేశారు. ఈ నిధులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు దోహదపడుతున్నాయి.

– ఎస్.పార్వతి, ఆసరా లబ్ధిదారు, 17వ వార్డు

వైఎస్సార్‌సీపీ గెలుపుతోనే రాష్ట్రాభివృద్ధి

- మూడు సార్లు గెలిచినా 'తూర్పు'లో వెలగపూడి చేసింది శూన్యం
- పార్టీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ
- ఎంవీపీ కాలనీ సెక్టార్–6లో ఎంవీవీతో కలిసి విస్తృత ప్రచారం


ప్రజలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ

ఎంవీపీ కాలనీ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి బొత్స ఝాన్సీ అన్నారు. విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో జనం కోసం.. జనంలోనే పేరిట మంగళవారం ఎంవీపీ కాలనీ సెక్టార్–6లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను ఎంవీవీతో కలిసి ఆమె వివరించారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జగనన్న గెలుపుతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్ సాధ్యమవుతుందన్నారు. గత ఐదేళ్లలో పేదల సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం అందించిన సేవలే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ఓటర్లు అఖండ మెజారిటీతో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. తూర్పు నియోజకవర్గం నుంచి మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన వెలగపూడి రామకృష్ణబాబు ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదన్నారు. 2019 ఎన్నికల్లో గెలిచిన తరువాత ఆయన ప్రజా సమస్యలు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. గత కొంతకాలంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ నియోజకవర్గ ప్రజల కోసం చేస్తున్న సేవలను కొనియాడారు. ఆయన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలుపుతారన్నారు. ఎంపీ ఎంవీవీ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం అందించని విధంగా ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలను వైఎస్సార్‌సీపీ అందించిందన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి ప్రజలు వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు కోలా గురువులు, పేర్ల విజయచందర్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయి బ్యాగ్‌తో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయితో ఉన్న బ్యాగ్‌ను విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలు ప్రకారం... డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీసు(డీఎస్‌ఆర్పీ), బి మోహనరావు ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ ఎస్‌ఐ జి. శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ అనంతరావులు తమ తమ సిబ్బందితో మంగళవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో పలు ప్లాట్‌ఫారాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సమయంలో అజ్ఞాత వ్యక్తి ఓ బ్యాగును విడిచిపెట్టి వెళ్లిపోయాడు. ఈ బ్యాగును తనిఖీ చేయగా ఇందులో సుమారు రూ.40వేలు విలువ 8 కేజీల గంజాయిని గుర్తించారు. బ్యాగ్‌ను సీజ్ చేసినట్లు జీఆర్పీ ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

క్లుప్తంగా

తూర్పు క్లస్టర్–4లో వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడిగా త్రినాథ్

ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తూర్పు నియోజకవర్గంలో ఆ పార్టీ అనుబంధ విభాగాలకు అధ్యక్షులను పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. ఈ మేరకు 1, 2 క్లస్టర్లలో 12 విభాగాలు, 3, 4 క్లస్టర్లలో 11 విభాగాలకు అధ్యక్షుల నియామకాలు చేపట్టారు. ఇందులో భాగంగా క్లస్టర్–4లో వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడిగా దలాయ్ త్రినాథ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆదాయం పెంచాలని సూచన


సిబ్బందికి జ్ఞాపికలందజేస్తున్న అప్పలనాయుడు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ జోన్–1 డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బి.అప్పలనాయుడు మంగళవారం దండుబజార్‌లోని కొత్త పార్శిల్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ పరిస్థితులను ఆయన తెలుసుకున్నారు. పార్శిల్ ద్వారా ఆదాయాన్ని మరింత పెంచాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆదాయం పెంపునకు కృషి చేస్తున్న పార్శిల్ సెంటర్ సిబ్బందిని అభినందించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాల్తేర్ డిపో మేనేజర్ సుధాకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్యం


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: గర్భిణులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం రేసవానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో జిల్లా ట్రైనింగ్ టీం ఆధ్వర్యంలో దక్షత శిక్షణ కార్యక్రమం జరిగింది. ఇందులో ఆయన పాల్గొని మాట్లాడారు. 3 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ప్రతి గర్భవతి 12 వారాల లోపు పేరు నమోదు చేసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ), పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రా (యూపీహెచ్‌సీ)ల్లో ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలన్నారు. దీని కోసం పారా మెడికల్ సిబ్బంది శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. మాతా–శిశు మరణాలు నమోదు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హైరిస్కు గర్భిణులను గుర్తించి సేవలందించాలన్నారు. అవసరం అయితే వీరిని రిఫరల్ ఆస్పత్రులకు పంపి సేవలందిస్తామన్నారు. ఈ శిక్షణలో 10 మంది పట్టణ/ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు, స్టాఫ్‌నర్స్‌లకు శిక్షణ ఇచ్చారు. నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, డాక్టర్ సమత, డాక్టర్ షర్మిల, ఐ.మనోరమ, కె.ధర్మేంద్ర, నాగభూషణం, స్టాఫ్‌నర్స్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

సీతమ్మధార : రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవరు మృతి చెందిన ఘటన ఫోర్తుటౌన్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. కైలాసపురానికి చెందిన గరికిన అప్పారావు (56) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని మంగళవారం రాత్రి 10.05 గంటల సమయంలో ఇంటికి వెళ్తున్న సమయంలో రైల్వేగేటు సమీపంలోని కాళీకామాత ఆలయం వద్ద కుక్క అడ్డురావడంతో షడన్ బ్రేక్ వేయడంతో ఆటో బోల్తా పడింది. అప్పారావు రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయమైంది. 108 సిబ్బంది వచ్చి పరీక్షించగా అప్పటికే మృతి చెందాడు. ట్రాఫిక్ సీఐ అమ్మినాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ. వాణిశ్రీ తెలిపారు.

'సీ–విజిల్' ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం



వివిధ శాఖల అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న తూర్పు అసెంబ్లీ ఆర్‌వో మయూర్ అశోక్

మహారాణిపేట: ఎన్నికల కమిషన్ రూపొందించిన సీ–విజిల్ యాప్‌లో నమోదైన ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కరం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్, తూర్పు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి కె.మయూర్ అశోక్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంలతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్‌వో మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా డబ్బు, మద్యం, డ్రగ్స్ విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలో కేసులు నమోదు అయ్యేలా చూడాలని కోరారు. దీనికి ఎన్‌ఫోర్సుమెంటు టీంలు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. తూర్పు అసెంబ్లీ నియోజకవర్గంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్టు పనితీరు మెరుగుపడాలని సూచించారు. రాబోయే రోజుల్లో సీజర్స్ కేసులు ఎక్కువగా నమోదు అయ్యేలా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అనుమతులు లేని సమావేశాలు, లౌడ్ స్పీకరు వినియోగంపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఈ సమావేశంలో లా అండ్ ఆర్డర్, సి–విజిల్ ఎన్‌ఫోర్సుమెంటు బృందాలు, అధికారులు పాల్గొన్నారు.

ఎంవీపీ రైతుబజార్‌లో క్లాత్ బ్యాగుల ఏటీఎం


క్లాత్ బ్యాగులు ఆవిష్కరిస్తున్న జీవీఎంసీ ఏడీసీ సన్యాసిరావు



క్లాత్ బ్యాగుల ఏటీఎం యంత్రం

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో సోలార్‌తో పని చేసే క్లాత్ బ్యాగుల పంపిణీ ఏటీఎంను ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ సంచులకు బదులుగా ఇక్కడ క్లాత్ బ్యాగులను ఈ ఏటీఎం ద్వారా వినియోగదారులు పొందవచ్చు. ఎన్జీవో సంస్థ జన కల్యాణ్ సమైక్య ఏర్పాటు చేసిన ఈ ఏటీఎంను జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ సన్యాసిరావు మంగళవారం ప్రారంభించారు. అనంతరం క్లాత్ బ్యాగులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎంవీపీ రైతుబజార్‌లో వినియోగదారుల కోసం మొదటి సారిగా క్లాత్ బ్యాగులు పంపిణీ చేసే ఏటీఎం యంత్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇది సోలార్ పవర్‌తో పని చేస్తుందన్నారు. దీనిలో 500 క్లాత్ బ్యాగులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. బ్యాగు ధర రూ.10 అని తెలిపారు. ఏటీఎంలో రూ.10 కాయిన్ గానీ, నోటు గానీ, రెండు రూ.5 కాయిన్లు గానీ వేస్తే ఒక క్లాత్ బ్యాగు బయటకు వస్తుందన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రైతుబజార్ ఈవో జి.ప్రసాద్, సిబ్బంది, జన కల్యాణ్ సమైక్య ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా పైడిమాంబ జాతర


గజమాల అలంకరణలో పైడిమాంబ అమ్మవారు..


ఆలయం ఆవరణలో వేపచెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు..


అమ్మవారి సన్నిధిలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: ఓల్డ్ డెయిరీ ఫారం జంక్షన్‌లో పైడిమాంబ అమ్మవారి నవరాత్రి జాతర మహోత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చిన వేల మంది భక్తులతో ఈ ప్రాంతం సందడిగా మారింది. ఈ ఉత్సవాలు ఈ నెల 18న ప్రారంభమైన విషయం తెలిసిందే. అప్పటి నుంచి రోజూ ఇక్కడ అమ్మవారికి భక్తులు పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. అమ్మవారి నవరాత్రి మహోత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా వేకువజాము నుంచి సాయంత్రం వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారు. అమ్మవారికి పూజలు, అభిషేకాలు చేశారు. మొక్కులు తీర్చుకొన్నారు. ఆలయ ఆవరణలో ఉన్న పురాతన వేపు చెట్టుకు పసుపు, కుంకమలతో పూజలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తాగునీరు, ప్రసాదం అందజేశారు. తోపులాటలు జరగకుండా క్యూల వద్ద పోలీసులు బందోబస్తుతో పాటు కమిటీ పెద్దలు, స్థానిక యువకులు జాగ్రత్త చర్యలు చేపట్టారు. గాంధీనగర్, రవీంద్రనగర్, ఆదర్శనగర్ నుంచి డెయిరీ ఫారం, ఇందిరానగర్ వరకు 14 గ్రామాలతో పాటు ఆరిలోవ, విశాలాక్షినగర్, హనుమంతవాక, పెదగదిలి, చినగదిలి ప్రాంతాల నుంచి వేల మంది భక్తులు రావడంతో ఆలయ పరిసరాలు కళకళలాడాయి.

అమ్మవారి సన్నిధిలో ఎంపీ ఎంవీవీ

పైడిమాంబ అమ్మవారిని పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు దర్శించుకున్నారు. విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ.. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ప్రసాదం వితరణ

రవీంద్రనగర్ నుంచి డెయిరీఫారం వరకు స్థానిక యువత, వివిధ సంఘాల నిర్వాహకులు రోడ్డుకు ఇరువైపులా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. భక్తులకు మజ్జిగ, పులిహోర, చక్కెర పొంగలి, బెల్లం నీరు(తీర్థం), ప్రసాదం, మంచినీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

జాతర సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తప్పెటగుళ్లు, పులివేషాలు, తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డప్పులు, వాయిద్యాల నడుమ రవీంద్రనగర్ ఆఖరి బస్‌స్టాప్ వద్ద ప్రారంభమైన సంబరాలు ఎస్‌ఐజీ నగర్, వివేకానందనగర్, సుందర్‌నగర్, ఆదర్శనగర్ మీదుగా డెయిరీఫారం వద్ద అమ్మవారి గుడి వరకు సాగాయి. సాయంత్రం జరిగిన పరసలో స్టాళ్ల వద్ద ప్రజల రద్దీ కనిపించింది. భక్తుల రద్దీని నియంత్రించి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆరిలోవ పోలీసులు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. సీఐ గోవిందరావు, ఎస్ఐలతో పాటు సుమారు 50 మంది సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్లు ఇక్కడ బందోబస్తు నిర్వహించారు. జాతరరద్దీని దృష్టిలో పెట్టుకొని ఆదర్శనగర్, రవీంద్రనగర్‌కు వెళ్లే సిటీ బస్సులను ట్రాఫిక్ పోలీసులు హనుమంతవాక నుంచి పెదగదిలి మీదుగా మళ్లించారు.

శ్రీకృష్ణాపురం గురుకుల విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులు వేసిన చిత్రాలు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు శ్రీకృష్ణాపురం గురుకుల విద్యార్థులు చిత్ర లేఖనంలో ప్రతిభ కనబరిచారు. వివిధ రకాల రంగులతో చిత్రాలు వేసి పతకాలు సాధించారు. డ్రీమ్ హార్ట్ సంస్థ విజయవాడలో 11వ ఆలిండియా చిల్డ్రన్ అండ్ యూత్ ఆర్ట్ కాంపిటీషన్ కం ఎగ్జిబిషన్ ఇటీవల జరిగింది. ఈ పోటీలకు విద్యార్థులు గురుకులంలోనే ఉంటూ చిత్రాలు వేశారు. ఇందులో భాగంగా శ్రీకృష్ణాపురం గురుకులానికి చెందిన ఆరు నుంచి 9వ తరగతి వరకు 50 మంది విద్యార్థులు చిత్ర లేఖనం పోటీలో పాల్గొన్నారు. వివిధ చిత్రాలను ఆకర్షణీయంగా వేశారు. వాటిని ఆన్‌లైన్‌లో నిర్వాహకులకు పంపించగా.. 15 బంగారు, 15 వెండి పతకాలు విద్యార్థులు సాధించినట్లు గురుకులం డ్రాయింగ్ ఉపాధ్యాయుడు పిడమర్తి సుధాకర్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఇటీవల గురుకులాన్ని సందర్శించిన సాంఘిక సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హర్షవర్ధన్, గురుకులాల జిల్లా సమన్వయాధికారి ఎస్.రూపావతి అభినందించారు.

కారు ఢీకొని ముగ్గురికి గాయాలు


తీవ్ర గాయాలైన వృద్ధుడు


నుజ్జయిన స్కూటీ


ప్రమాదానికి కారణమైన కారు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డులో మంగళవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ముగ్గురు గాయాలు పాలయ్యారు. వారిలో ఓ వృద్ధుడికి తీవ్రగాయాలు కాగా, ఇద్దరు భార్యాభర్తలకు స్వల్ప గాయాలయ్యాయి. ట్రాఫిక్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాలు ప్రకారం.. హనుమంతవాక నుంచి స్కోడా కారులో ఓ మహిళ సింహాచలం వైపు వెళ్తోంది. బీఆర్‌టీఎస్ మధ్య లైన్‌లో ప్రయాణిస్తున్న ఆ కారు ముడసర్లోవ ప్రాంతం రామకృష్ణాపురం సమీపంలో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి పక్క లైన్‌లోకి దూసుకుపోయింది. అదే సమయంలో ఆడవివరం నుంచి హనుమంతవాక వైపు వెళ్తున్న రెండు ద్విచక్రవాహనాలను ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న ఓ 60 ఏళ్ల వృద్ధుడికి రెండు కాళ్లు విరిగిపోయాయి. మరో బైక్‌పై వెలుతున్న భార్యాభర్తలకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకొన్న ఆరిలోవ ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొనే సరికి కారు నడిపిన మహిళ ఆ కారును విడిచిపెట్టి పారిపోయారు. గాయాలపాలైనవారిని పోలీసులు హెల్త్‌సిటీలో ఓ ఆస్పత్రి లో చేర్చారు. ప్రస్తుతం వారు ముగ్గురు చికిత్స పొందుతున్నారు. దీనిపై ఎస్ఐ శ్రీకాంత్ కేసు నమోదు చేశారు. కారు మితిమీరిన వేగంతో ప్రయాణించడం వల్లే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు అంటున్నారు.

నేరాల నియంత్రణకు సహకరించాలి

సీతమ్మధార: నగరంలో దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ద్వారకా క్రైం పోలీసుల ఆధ్వర్యంలో శ్రీనగర్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. దొంగతనాలు జరగకుండా పోలీసులకు స్థానిక యువకులు సహకరించాలని కోరారు. అనుమానితులు కనిపిస్తే తక్షణమే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజు, ఏఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఏయూ సమాచారం

ఏయూలో ఎఫ్‌డీఏ శాస్త్రవేత్త సందడి


వై.శ్రీరామ కృష్ణయ్యను సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని అమెరికాలోని ఎఫ్‌డీఏ సీనియర్ శాస్త్రవేత్త వై.శ్రీరామ కృష్ణయ్య మంగళవారం సందర్శించారు. ఏయూ ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థి, పూర్వ ఆచార్యుడైన వై.శ్రీరామ కృష్ణయ్య ముందుగా కళాశాల ఆచార్యులతో సమావేశమయ్యారు. ఫార్మా రంగంలో జరుగుతున్న మార్పులు, ప్రగతిపై చర్చించారు. ఫార్మా కళాశాలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను, నూతనంగా నిర్మించిన ఎలిమెంట్ భవనాన్ని తిలకించారు. అనంతరం ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో సమావేశమయ్యారు. ఏయూ ప్రగతికి సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ తరఫున శ్రీరామ కృష్ణయ్యను వీసీ సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, ఆచార్య ఈశ్వర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెస్ట్రన్ ఆస్ట్రేలియా ప్రతినిధుల సందర్శన


వీసీ ఆచార్య ప్రసాదరెడ్డికి జ్ఞాపిక అందిస్తున్న నషీద్ చౌదరి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని వెస్ట్రన్ ఆస్ట్రేలియా ప్రతినిధులు మంగళవారం సందర్శించారు. వెస్ట్రన్ ఆస్ట్రేలియా ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ట్రేడ్ కమిషన్(ఇండియా–గల్ఫ్) నషీద్ చౌదరి, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఆంటోని జోసఫ్‌లు ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి సంకాలపై చర్చించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరెడ్డికి జ్ఞాపికను నషీద్ చౌదరి బహూకరించారు.